క్లుప్తంగా

షిర్డీసాయి విగ్రహాన్ని తాకిన సూర్యకిరణాలు



షిర్డీసాయి విగ్రహాన్ని తాకిన సూర్యకిరణాలు

నరసన్నపేట: స్థానిక కలివరపుపేటలోని షిర్డీ సాయి విగ్రహాన్ని శుక్రవారం ఉదయం సూర్య కిరణాలు తాకాయి. ఉదయం 6.15 నుంచి 6.25 నిమిషాల మధ్య సూర్యకిరణాలు తాకాయని అర్చకులు చెల్లూరి విశ్వనాథ శర్మ తెలిపారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో షిర్డీ సాయిని దర్శించుకున్నారు. ప్రతీ ఏటా ఈ నెలలో సూర్యకిరణాలు తాకుతున్నాయని విశ్వనాథ శర్మ తెలిపారు.

బార్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గంతో సివిల్ జడ్జి హరిప్రియ

నరసన్నపేట: స్థానిక జూనియర్ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షుడిగా జామి కామేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్‌గా వి.వి.వెంకటరమణ, ప్రధాన కార్యదర్శిగా గొలివి గణేష్, ట్రెజరర్ వాన శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శిగా ఎం.శ్రీలక్ష్మి ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గానికి జూనియర్ సివిల్ జడ్జి సి.హరిప్రియ అభినందించారు.

పదో తరగతి పరీక్ష కేంద్రం పరిశీలన

పొందూరు: మండలంలోని కింతలి, తాడివలస పదో తరగతి పరీక్ష కేంద్రాలను ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం శుక్రవారం తనిఖీ చేశారు. విద్యార్థులు సౌకర్యవంతంగా పరీక్షలు రాస్తున్నారా, మౌలిక సదుపాయాలు కల్పించారా లేదా అని ఆరా తీశారు. మధ్యాహ్న భోజన పథకంలో వండుతున్న వంటలను పరిశీలించారు. ఎంఈఓ పీవీ రామరాజు, స్త్రీశిశు సంక్షేమశాఖ సీడీపీఓ అనూరాధ, పీటీసీ మెట్ట మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

సారవకోట: మండలంలోని వడ్డినవలస గ్రామ త్రినాథ స్వామి ఆలయ 67వ వార్షికోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించి గర్భగుడిని, మూల విరాట్‌ను పూలతో అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో హోమం, ప్రత్యేక, విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. లక్ష్మీనారాయణ, పార్వతీ పరమేశ్వరుల కల్యాణాన్ని నిర్వహించినట్లు అర్చకులు తెలిపారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి అనేక మంది భక్తులు తరలివచ్చారు. మూడు రోజులపాటు ఈ ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు.

రూ.లక్ష ఆర్థికసాయం



ఆర్థిక సహాయం అందజేస్తున్న సీఐ దివాకర్

ఆమదాలవలస: ఆమదాలవలస సర్కిల్ పరిధి బూర్జ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ ఈ నెల ఒకటో తేదీన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కానిస్టేబుల్ కొత్తూరు సురేష్ కుటుంబానికి రూ.లక్ష ఆర్థిక సహాయాన్ని సీఐ దివాకర్ శుక్రవారం అందజేశారు. సర్కిల్ పరిధిలోని సిబ్బంది సేకరించిన మొత్తంతోపాటు, తనవంతుగా కొంత మొత్తాన్ని అందించినట్లు సీఐ తెలిపారు. బూర్జ ఎస్ఐ ప్రసాద్, ఆమదాలవలస వెంకటేష్ పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

పొందూరు: మండలంలోని పలు ప్రాంతాల్లో వాహనాలను ఫ్లయింగ్ సర్వేలైన్ టీమ్ సభ్యులు (ఎఫ్ఎస్టీ) ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. ఎఫ్ఎస్టీ ఇన్‌చార్జి ఆదిలక్ష్మి స్థానిక పోలీసులతో కలిసి పొందూరులో శుక్రవారం తనిఖీలు చేపట్టారు. సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున నగదు, మద్యం, బంగారం, వెండి రవాణా జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నామని ఎఫ్ఎస్టీ ఇన్‌చార్జి ఆదిలక్ష్మి తెలిపారు.

కుంకుమార్చనలు

సరుబుజ్జిలి: పురుషోత్తపురంలో ఉమాకామేశ్వరస్వామివారి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం కుంకుమ పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన పూజారి వెంకటరమణ, ప్రసాదరావు, మల్లేశ్వరరావు కుటుంబ సభ్యులు బహూకరించిన వెండి కిరీటాన్ని అమ్మవారికి అలంకరించారు. సుబ్రహ్మణ్యస్వామివారికి క్షీరాభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అన్నప్రసాదవితరణ చేశారు. భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు.

టీడీపీలో అసమ్మతి సెగ

- 'మామిడి' ఎలా గెలుస్తాడో చూస్తాం
- కలమట వెంకటరమణ వర్గీయుల శపథం
- పార్టీకి, పదవులకు మూకుమ్మడిగా రాజీనామా

మెళియాపుట్టి:

పాతపట్నంలో మామిడి గోవిందరావు ఎలా గెలుస్తాడో తాము చూస్తామని పలువురు టీడీపీ నాయకులు అన్నారు. ఆ పార్టీ అధిష్టానం మామిడికి సీటు కేటాయించడంపై వారంతా ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో మండల తెలుగుదేశం అధ్యక్షుడు భాస్కర్ గౌడ్ అధ్యక్షతన శుక్రవారం సమావేశమయ్యారు. పదవులకు, పార్టీకి మూకుమ్మడిగా రాజీనామా చేశారు. కనీసం పది మంది కూడా వెంట లేని నాయకుడికి టికెట్ ఇస్తే సహకరించేది లేదన్నారు. పార్టీ ఆదేశించిన ప్రతి కార్యక్రమాన్ని తూచా తప్పకుండా కలమట వెంకటరమణ చేశారని, పార్టీకి ఉపయోగపడే ఒక్క కార్యక్రమం సైతం గోవిందరావు చేయలేదన్నారు. కింజరాపు కుటుంబం ప్రతి వేదిక ద్వారా కలమటకే టికెట్ ఇస్తామని చెప్పిందని, అచ్చెన్నాయుడును నమ్మితే మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ ప్రచార సామగ్రిని సైతం కాల్చివేశారు. రాజీనామాలు చేసిన వారిలో మండల టీడీపీ అధ్యక్షుడు భాస్కర్ గౌడ్, మండల జనరల్ సెక్రటరీ ఉర్లాన వసంత్, జిల్లా మైనారిటీ ప్రధాన కార్యదర్శి సయ్యద్ శిలార్, మండల యువత అధ్యక్షుడు బసవ పరమేష్ రెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు పడాల శ్రీను, మండల రైతు అధ్యక్షుడు సిరిపురం వెంకటరావు, క్లస్టర్ ఇంచార్జిలు మాలతి శ్రీధర్, సవలాపురం రామ్మోహన్, పలువురు కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

పాతపట్నంలో..

పాతపట్నం: టీడీపీ మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణకు టికెట్ నిరాకరించడంతో ఆ పార్టీ నాయకులు తమ పదవులకు రాజీనామా చేస్తున్నామని హిరమండలం జెడ్పీటీసీ సభ్యుడు గవర చిట్టిబాబు, టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధ్యక్షుడు, మండల పార్టీ అధ్యక్షుడు పైల లక్ష్మయ్య, పాతపట్నం టౌన్ అధ్యక్షుడు సైలాడ సతీష్ తెలిపారు. వీరు పాతపట్నంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. కలమటకు సీటు ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. మామిడికి సహకరించేది లేదని తేల్చి చెప్పారు. పార్టీ సీనియర్ నాయకుడు దువ్వాడి ఉదయ్ భాస్కరరావు, ధనుపురం సర్పంచ్ దారపు ఢిల్లేశ్వరరావు, మాజీ ఎంపీటీసీలు కర్రి అప్పారావు, కనకాల నారాయణ, నాయకులు కలమట బుజింగరావు, నల్లి లక్ష్మణరావు, ఇప్పిలి రాజా, బాబూరావు, బుజ్జి, తులుగు వినోద్, ఇప్పిలి సురేష్, బెజ్జిపల్లి శివాజీ, ఎల్.ఉత్తేజ్ పాల్గొన్నారు.

ఎల్.ఎన్.పేటలో..

ఎల్.ఎన్.పేట: కలమట వెంకటరమణకు పాతపట్నం సీటు ఇవ్వకపోవడంపై టీడీపీ నాయకులు అసంతృప్తి వ్యక్తం చేశారు. మండలంలోని శ్యామలాపురం వద్ద ఓ కల్యాణ మండపంలో పార్టీ నాయకులు శుక్రవారం సమావేశమయ్యారు. టీడీపీ ఆవిర్భావం నుంచి కలమట కుటుంబం పార్టీ కోసం కష్టపడి పనిచేసిందని, ఆయనకు టికెట్ ఇవ్వకుండా అన్యాయం చేశారని మండిపడ్డారు. పార్టీ నాయకులతోను, కార్యకర్తలతోను సంబంధం లేదని మామిడి గోవిందరావుకు టికెట్ ఇవ్వడం సరికాదన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న పలువురు నాయకులు పార్టీ పదవులకు రాజీనామా చేస్తామని ప్రకటించారు. పార్టీ నాయకులు శిమ్మ మోహనరావు (ఎంపీటీసీ), మెండ మనోహర్, చింతాడ శ్రీనివాసరావు, ఒమ్మి ఆనందరావు, తంగి అప్పన్న, కొమరాపు తిరుపతిరావు, మెండ శ్రీనివాసరావు, లావేటి మల్లేశ్వరరావు, లుకలాపు లక్ష్మునాయుడు, పెద్దకోట తవుడు, ఇప్పిలి ఉపేంద్ర, బటాన లక్ష్మీనారాయణ, కంటుమజ్జి సత్యనారాయణ, బుక్క బాలకృష్ణ, బుక్క వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

హిరమండలంలో..

హిరమండలం: హిరమండలంలో టీడీపీ శ్రేణులు భగ్గుమన్నాయి. పాతపట్నం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా మామిడి గోవిందరావు పేరు ప్రకటించడంతో టీడీపీ కార్యకర్తలు, నాయకులు రోడ్డుపైకి వచ్చారు. హిరమండలం న్యూబ్యారేజీ సెంటర్ అలికాం–బత్తిలి రహదారిపై ఆందోళన చేపట్టారు. టీడీపీ జెండాలు, ఫ్లెక్సీలు, కరపత్రాలను దహనం చేశారు. టీడీపీతోపాటు చంద్రబాబు నాయకత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. హిరమండలం జెడ్పీటీసీ పాగిరి బుచ్చిబాబు, టీడీపీ మండల అధ్యక్షుడు చెట్టు శ్రీనివాసరావు, కార్యదర్శి డి.ఢిల్లేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, నాయకులు, క్లస్టర్, బూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



హిరమండలం: టీడీపీ కరపత్రాలను చించుతున్న ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు



పాతపట్నం: మాట్లాడుతున్న టీడీపీ నాయకులు



ఎల్.ఎన్.పేట: సమావేశంలో పాల్గొన్న టీడీపీ నాయకులు



మెళియాపుట్టి: ఆవేదన వ్యక్తం చేస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు



కొత్తూరు: మాతలలోని కలమట నివాసం వద్ద ఉన్న బ్యానర్‌ను తొలగించిన దృశ్యం

కొత్తూరులో..

కొత్తూరు: పార్టీ బలోపేతానికి ప్రతి నిత్యం కృషి చేసిన కలమట వెంకటరమణకు టికెట్ నిరాకరించడం అన్యాయమని టీడీపీ మండల అధ్యక్షుడు పాత్రకొండ మోహన్‌రావు, పార్టీ నేతలు అన్నారు. కొత్తూరు నాలుగు రోడ్ల కూడలి వద్ద నిరసన చేపట్టారు. టీడీపీ నాయకులు అగతమూడి మాధవరావు, లోతుగెడ్డ భగవాన్‌నాయుడుచ ఆసూరు ఆనందరావు, వలురౌతు గోవిందరావు, గెడ్డవలస కమలాకరరావు, తీమర జగదీశ్వరరావు, అడపాక శంకరరావు, పెద్దిన అమర్, ఎద్దు శ్రీనివాసరావు, వలురౌతు వెంకటరావు, నెల్లి అచ్యుతరావు, మడపాన రాజారావు, గేదెల సోమేశ్వరరావు, సి.హెచ్.లోకేశ్వరరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ బ్యానర్ల తొలగింపు

టీడీజీ మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణకు చంద్రబాబు టికెట్ నిరాకరించడంతో టీడీపీ కార్యాలయం ముందు ఉన్న బ్యానర్‌లను తొలగించారు.



కొత్తూరు: నాలుగు రోడ్లు కూడలిలో టీడీపీ నాయకుల నిరసన ప్రదర్శన

అత్యధిక మెజార్టీతో గెలిపించాలి

- ఫ్యాన్ గుర్తుకే ఓటేయ్యండి
- స్పీకర్ తమ్మినేని సీతారాం, ఎమ్మెల్యేలు ధర్మాన కృష్ణదాస్, రెడ్డి శాంతి

పొందూరు: సంక్షేమ పథకాలను అమలు చేసి ప్రజల జీవన ప్రమాణాలను పెంచి, ప్రజారంజక పాలన చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆదరించాలని, ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని స్పీకర్ తమ్మినేని సీతారాం కోరారు. పొందూరు పంచాయతీలోని వివిధ వీధుల్లో ఎన్నికల ప్రచారాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కిల్లి ఉషారాణి, పీఏసీఎస్ అధ్యక్షుడు కొంచాడ రమణమూర్తి, ఏఎంసీ చైర్మన్ బాడాన సునీల్ కుమార్, పార్టీ రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి బండారు జైప్రతాప్‌కుమార్, గుడ్ల మోహన్, పెద్దింటి రవిబాబు, అనకాపల్లి గోవింద, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి..

నరసన్నపేట: నియోజకవర్గ కేంద్రం నరసన్నపేటలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు, బూత్ కమిటీ సభ్యులు, వార్డు సభ్యులు, ఎంపీటీసీలు సమన్వయంతో పనిచేయాలని అప్పుడే అనుకున్నట్లుగా మనం ఓట్లు సాధించగలమని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం నరసన్నపేట టౌన్‌లో ఉన్న 22 పోలింగ్ కేంద్రాలకు చెందిన బూత్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. నరసన్నపేటలో ఎంతో అభివృద్ధి చేశామని దీనిని ప్రజలకు వివరించాలని కోరారు. ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు, సర్పంచ్ బూరల్లి శంకర్, పార్టీ నాయకులు తంగుడు జోగారావు, గుప్త, పి.సాయిప్రసాద్, బోయిన బాలకృష్ణ, వైశ్యరాజు కేశవరావు, గనగళ్ల శ్రీను, డేవిడ్, దండి జయప్రకాశ్, బీఎల్ శర్మ, తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే పేదల అభ్యున్నతి

మెళియాపుట్టి: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావడంతోనే పేద ప్రజల అభ్యున్నతి సాధ్యమవుతుందని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండలంలోని భరణికోట సచివాలయం పరిధిలోని భరణికోట, బాలేరు, మర, జన్నివీధి, కాటంవీధి, జక్కరవీధి, బంజీరు గ్రామాల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిని చేయాలని కోరారు.



పొందూరు: తనకు ఓటు వేయమని ఇస్త్రీ చేస్తున్న వ్యక్తిని అడుగుతున్న స్పీకర్ తమ్మినేని సీతారాం



నరసన్నపేట: మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

జెడ్పీటీసీ సభ్యుడు గూడ ఎండయ్య, ఎమ్మెల్యే తనయుడు రెడ్డి ఓం శ్రీకృష్ణ, పార్టీ మండల నాయకుడు ఉదయ్‌కుమార్, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మాధవరావు, కోఆప్షన్ సభ్యుడు భాస్కరదాస్, పీఏసీఎస్ అధ్యక్షుడు బాలరాజు, మండల కన్వీనర్ పల్లి యోగి, సర్పంచ్ నీలమ్మ, ఎంపీటీసీ రవికుమార్, నాయకులు ఈశ్వరరావు, బాలరాజు, జయమునిరావు, సవర సుభాష్, సవర రంగారావు, సవర హడ్డియ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, యువత పాల్గొన్నారు.

ఇంటింటా ప్రచారం చేపట్టాలి

నరసన్నపేట: ఎన్నికల సందర్భంగా పోలింగ్ తేదీ వరకు ఇంటింటికీ కనీసం ఐదుసార్లు వెళ్లి ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు గుర్తుచేయాలని ఎంపీపీ ఆరంగి మురళి అన్నారు. మండలంలోని దూకులపాడులో శుక్రవారం మేం సిద్ధం – మా బూత్ సిద్ధం కార్యక్రమంలో భాగంగా పంచాయతీ పరిధిలోని వైఎస్సార్‌సీపీ నాయకులతో సమీక్ష నిర్వహించారు. పంచాయతీ పరిధిలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టామని, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించామన్నారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు, సర్పంచ్ అల్లు అసిరినాయుడు, పార్టీ నాయకులు అప్పన్న, సురంగి నర్సింగరావు, బొబ్బాది ఈశ్వరరావు, దుల్ల రమణ, బగ్గు రమణయ్య, పాగోటి గోవిందరావు పాల్గొన్నారు.



నరసన్నపేట: మేం సిద్ధం అంటున్న నాయకులు, గ్రామస్తులు



సారవకోట: బుడితి గ్రామస్తులతో ధర్మాన కృష్ణచైతన్య, పార్టీ నాయకులు

బూత్ ఏజెంట్ల పాత్ర కీలకం

సారవకోట: రానున్న సాధారణ ఎన్నికల్లో బూత్ ఏజెంట్ల పాత్ర కీలకమని పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య సూచించారు. మండలంలోని వెంకటాపురం, బుడితి గ్రామాల్లో మేం సిద్ధం.. మా బూత్ సిద్ధం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలు ఎన్నికల సమయంలో అప్రమత్తంగా ఉండాలని, పార్టీ గుర్తు ఫ్యాన్‌ను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు వరుదు వంశీకృష్ణ, డీఎల్‌డీఏ చైర్మన్ నక్క తులసీదాస్, పార్టీ నాయకులు పారశెల్లి తేజేశ్వరరావు, యాళ్ల శ్యామసుందరరావు, నిక్కు రాజశేఖర్, మెండ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మెళియాపుట్టి: భరణికోటలో ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న, వివరిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

రామదాసుపేటలో ఆక్రమణలు!





ప్రభుత్వ భూముల్లో వేసిన షెడ్‌లు

- టీడీపీ నాయకుల బరితెగింపు..

జలుమూరు: అల్లాడపేట పంచాయతీ పరిధి రామదాసుపేటలో టీడీపీ నాయకులు ప్రభుత్వ భూములకు ఆక్రమించుకుంటున్నారు. సర్వే నెంబర్ 48లో 1 ప్రభుత్వ పాఠశాల పాత భవనం స్థానంలో ఓ టీడీపీ నాయకుడు ట్రాక్టర్ పెట్టుకునేందుకు రేకులు షెడ్ వేశాడు. చెరువుకు ఆనుకొని ఉన్న భూమి సర్వే నంబర్ 50లో 5 సబ్ డివిజన్‌లో మరో నాయుకుడు పశువుల శాల నిర్మాణం చేశాడు. ఆక్రమణలపై స్థానిక అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరోపించారు. దీనిపై తహసీల్దా ర్ నాగమ్మను వివరణ కోరగా.. ఆర్ఐను పంపించి ఆక్రమణలు తొలగిస్తామన్నారు. ప్రభుత్వ పాఠశా ల విషయమై ఎంఈఓ మాధవరావు మాట్లాడుతూ.. స్థానిక హెచ్ఎం ప్రభావతి వద్ద నివేదిక తీసుకుంటామన్నారు. దీనిని ఉన్నతాధికారుల దృష్టిలో పెట్టి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

సకాలంలో రుణాలు రెన్యువల్ చేస్తే వడ్డీ రాయితీ

ఆమదాలవలస: కృష్ణాపురం పీఏసీఎస్ పరిధిలో వ్యవసాయ రుణాలు పొందిన రైతులు సకాలంలో వడ్డీ చెల్లించి రెన్యువల్ చేసుకోవాలని పీఏసీఎస్ అధ్యక్షుడు గురుగుబెల్లి శ్రీనివాసరావు కోరారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ఈ నెలాఖరులోగా రుణాలకు వడ్డీని చెల్లిస్తే7 శతం రాయితీ వర్తిస్తుందన్నారు. వడ్డీని చెల్లించి రైతులు రుణం రెన్యువల్ చేయించుకోకపోతే 13 శాతం వడ్డీ చెల్లించాల్సి వస్తుందన్నారు. కృష్ణాపురం పీఏసీఎస్ పరిధిలో 3011 మంది రైతులకు సంబంధించి ప్రభుత్వం ద్వారా రూ.15.89 కోట్ల రుణాలు మంజూరు చేశామన్నారు. ఇప్పటికే రూ.10కోట్లు వరకు వసూలు చేసినట్లు తెలిపారు. ఇంకా 1,365 మంది రైతులు రుణాలు రెన్యువల్ చేయించుకోవాలన్నారు.

జలమే జీవనాధారం

కొత్తూరు: మానవ మనగడకు నీరే ప్రధాన అధారమని స్థానిక వెలుగు ఏపీఎం జనార్దనరావు అన్నారు. ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా కొత్తూరులో మహిళా సంఘాల సభ్యులతో నీరు ఆదా చేయాలంటూ శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఏపీఎం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నీటిని ఆదా చేయాలని కోరారు. మహిళా సంఘాల సభ్యులు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

నరసన్నపేటలో..

నరసన్నపేట: జలమే జీవనాధారమని, భావి తరాలకు నీటి లభ్యత ఉండాలంటే ప్రతిఒక్కరూ నీటిని పొదుపుగా వాడాలని, వర్షం నీటిని భూమిలో ఇంకించాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.లత అన్నారు. ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా శుక్రవారం కళాశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులు, అధ్యాపకులు పట్టణంలో ప్లకార్డులతో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. అధ్యాపకులు రవికుమార్, శాంతి హేమ్, ఎన్ఎస్ఎస్ పీఓ అన్నాజీరావు తదితరులు నీటి ఆవశ్యకతను వివరించారు.



కొత్తూరు: ర్యాలీ నిర్వహిస్తున్న మహిళా సంఘాల సభ్యులు

ఓటీఏ కార్యవర్గం ఎన్నిక

పాతపట్నం: ఒరియా టీచర్స్ అసోసియేషన్ (ఓటీఏ) పాతపట్నం మండల శాఖ అధ్యక్షుడిగా గణేష్ బరోడా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం పాతపట్నం ప్రభుత్వ ఒడియా పాఠశాలలో ఆప్టో రాష్ట్ర అధ్యక్షుడు విశ్వనాథ బరోడా పర్యవేక్షణలో మండల శాఖ ఎన్నికలు నిర్వహించారు. ఉపాధ్యక్షుడిగా మనీషా జెన్నా, సెక్రటరీగా హరి బిశ్వాల్, జాయింట్ సెక్రటరీగా శకుంతల పుల్లాయ్, ట్రెజరీగా అనిల్‌కుమార్ ప్రధాన్, సభ్యులుగా నర్సింగ నాయక్, బిందినిదేవి, శిబిరామ్ ప్రధాన్, లీనా, శిశిరో జెన్నా, రబినరయన్ సాహు ఎంపియ్యారు. అధ్యక్ష, ఉపాధ్యక్షులను విశ్వనాథ బరోడా అభినందించారు. ఆప్టో ఉపాధ్యక్షుడు సురేంద్ర పండా, నబినారయణచంద్ర, భీమ్‌సేన్ పండా పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

పాతపట్నం: పాతపట్నం నియోజకవర్గం పరిధిలోని ప్రింటింగ్ ప్రెస్ యాజమానులు ఎన్నికల నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని తహసీల్దార్ ప్రసాదరావు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ప్రింటింగ్ ప్రెస్ యాజమానులతో సమావేశం నిర్వహించారు. రాజకీయ పార్టీలకు సంబంధించిన ముద్రణలు, కరపత్రాలు, స్టిక్కర్ల సంఖ్య, వివరాలు తెలియజేయాలన్నారు. ప్రింటింగ్ ప్రెస్ యాజమానులు ఎన్నికల నియమావళిని పాటించాలన్నారు. ఎన్నికల డీటీ వెంకటరమణ పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చూడండి



మాట్లాడుతున్న ఎంపీపీ కూర్మినాయుడు

సారవకోట: వేసవిని దృష్టిలో పెట్టుకుని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు సూచించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ ఈ ఏడాది వేసవి తీవ్రత అధికంగా ఉంటుందని వాతావరణశాఖ హెచ్చరికలు ఇప్పటికే జారీ చేసిందన్నారు. ఇప్పటినుంచే ప్రణాళికబద్ధంగా గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించారు. అవసరమైన చోట చలివేంద్రా లు ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల నియమాళి మేరకు సభ నిర్వహించామన్నారు. తహసీల్దార్ భాగ్యవతి, ఎంపీడీఓ రాంబాబు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.